వాతావరణం.. పూతకు ప్రతికూలం

మామిడి చెట్లు పూతతో కళకళలాడుతూ కనిపించాల్సిన సమయమది. నవంబర్ నుంచి డిసెంబర్ నెలాఖారు వరకు పూత పట్టాలి. జనవరి నెలలో గుత్తులుగా విరగ్గాయాలి. ఇంతవరకు ఈ పరిస్థితి కనిపించలేదు. దీని ప్రభావం దిగుబడిపై పడనుంది. మామిడి కొమ్మకు ఏమైందో.. మధుర ఫలం దక్కుతుందో.. లేదోనని రైతుల్లో గుబులు రేగుతోంది.

- అదును దాటుతున్నా కనిపించని పూత
- దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం
- కొనుగోలు వ్యాపారులు నిరాసక్తత
- ఆందోళనలో అన్నదాత



పూత రాని మామిడి చెట్లు

లక్కిరెడ్డిపల్లె : మామిడి రైతును ప్రకృతి పగ బడుతోంది. ఫలరాజంపై వాతావరణంలో మార్పులు కారణంగా ఈ ఏడాది కూడా పూతలు రావడం ఆలస్యం అవుతోంది. ప్రతి సంవత్సరం నవంబరు, డిసెంబరులో మామిడి చెట్లు పూతతో నిండి ఉంటాయి. కానీ వాతావరణ మార్పుల కారణంగా ఫిబ్రవరి నెల మొదటి వారం దాటిపోయినా పూత జాడలేదు. ఏ చెట్టు చూసినా ఇగురుగానీ, పూత గానీ లేక వెలవెలబోయి కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు పూత పూయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత కోసం వేల రూపాయలు ఖర్చు చేసి పురుగు మందులు పిచికారి చేసిన రైతులకు తీవ్ర నిరాశే మిగిలింది. పూత జాడ కనిపించకపోవడంతో వ్యాపారస్తులు తోటలు కొనడానికి వెనుకంజ వేస్తున్నారు.

దిగుబడిపై ప్రభావం

ఈ సారి మామిడి పూత ఆలస్యం కావడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. పూత రావడం ఆలస్యం కావడంతో పంట చేతికొచ్చే సమయానికి వర్షాలకు నేలపాలవుతుందనే ఆందోళన రైతులను వెంటాడుతోంది. మామిడి పంట బాగా పండితే హెక్టారుకు 8 టన్నుల దాకా దిగుబడి వస్తుంది. ప్రతి ఏడాది డిసెంబరు ఆఖరు, జనవరి మాసాల్లో పూర్తి స్థాయిలో పూత వస్తోంది. ఏప్రిల్ రెండో వారం నుంచి పంట కోత దశకు చేరుకుంటుంది. అప్పటి నుంచి జూన్ మొదటి వారం దాకా మామిడి కాయలు కోతలు కొనసాగుతాయి. తొలిగా వచ్చిన పంటకు మార్కెట్‌లో ధర బాగా దక్కుతుంది. ఆలస్యంగా కోతకు వస్తే ఆశించిన స్థాయిలో ధరలు ఉండవు. ఈ సారి ఆలస్యంగా పూత రావడంతో ఆశాజనకంగా దిగుబడి వస్తుందా..? అంతే స్థాయిలో ధర దక్కుతుందా..? లేదోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పొంచి ఉన్న తెగుళ్ల బెడద

ఈసారి మామిడి తోటలు ఆలస్యంగా పూత పూయడంతో తెగుళ్ల సోకే అవకాశం ఉందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్ల నివారణకు ఉద్యానశాఖాధికారులు ప్రతి గ్రామంలో గ్రామ సభలు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉద్యాన శాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి సబ్సిడీతో పురుగు మందులతో పాటు మామిడి చెట్లను కత్తిరించేందుకు పరిరాలు, వ్యవసాయ పనిముట్లు అందించాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



మామిడి సాగు ఆశాజనంగా లేదు. ప్రతి ఏడాది నష్టపోతున్నాం. వర్షాలు లేక చెట్లను కాపాడుకునేందుకు అప్పులు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాం. ఇప్పుడు ఎరువులు, మందులకు అప్పులు చేశాం. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా ఎరువులు, పురుగు మందులతో పాటు పండు ఈగ బుట్టలు ఉచితంగా అందించి ఆదుకోవాలి.

-వెంకటరామిరెడ్డి, మామిడి రైతు, సోమలవాండ్లపల్లె, లక్కిరెడ్డిపల్లె మండలం

అవగాహన కల్పిస్తున్నాం

మామిడి రైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి స్కీంలు రాలేదు. స్కీములు వస్తే రైతులకు సమాచారం ఇస్తాం. రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాలకు చెందిన మామిడి రైతులకు మామిడిలో సస్యరక్షణపై అవగాహన కల్పించాం. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో పూత రావడం అలస్యవుతోంది. ఈ ఏడాది దిగుబడి కూడా తగ్గే అవకాశం ఉంది.

-నాగమణి, ఉద్యానశాఖాధికారిణి, లక్కిరెడ్డిపల్లె

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

గాలివీడు : అర్హులైన ముస్లిం మైనారిటీ, క్రిస్టియన్‌లు సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ జవహర్ బాబు సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ గాలివీడు మండలానికి ఏపీజీబీ-13, ఎస్బీఐ-13, యూనియన్ బ్యాంకు-13, ఏపీజీబీ నూలివీడు బ్రాంచ్-12, మొత్తం 51 యూనిట్లకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఒక్కో యూనిట్ విలువ రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ ఉందన్నారు. అందులో 50 శాతం సబ్సిడీ పోను 50 శాతం బ్యాంకులోను చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఉర్దూ మీడియం పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకోవాలి

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో ఉర్దూమీడియం పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకునేలా చూడాలని ఏపీ మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎం.ఎ.షరీఫ్‌కు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.జాబీర్ విజ్ఞప్తి చేశారు. గురువారం పట్టణంలోని మార్కెట్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన ఎం.ఎ.షరీఫ్‌ను ఎస్.జాబీర్ కలిశారు. విద్యాశాఖ చేస్తున్న ప్రతిపాదనల నుంచి ఉర్దూమీ డియం పాఠశాలలను మినహాయించి వాటిని బలోపేతం చేయాలని జాబీర్ కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు దావూద్, అమీనుల్లా, ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విగ్రహ ప్రతిష్ట



యాగశాలలో కలశ స్థాపన పూజలు నిర్వహించిన వేద పండితులు

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన కామాక్షమ్మ దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్టను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నూతనంగా నిర్మించి ఆలయం ఆవరణంలో కామాక్షమ్మ విగ్రహ ప్రతిష్టతో పాటు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, సింహవాహన, జీవధ్వజ, శిఖర కలశము, శ్రీ చక్ర సహిత విగ్రహ ప్రతిష్ట చేయనున్నారు. భక్తులు విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొనాలని వారు కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

వీరబల్లి : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ వెంకటేష్ తెలిపారు. వీరబల్లి మండల తహసీల్దార్‌గా వెంకటేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన సంబేపల్లె మండలంలో పనిచేస్తూ బదిలీపై వీరబల్లి వచ్చేశారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ శ్రావణి అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

పశు సంరక్షణ తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న పశువైద్యశాల ఉపసంచాలకులు డాక్టర్ మాలకొండయ్య

వీరబల్లి : పశువులు, మేకలు, గొర్రెల్లో పలు రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటాయని, సకాలంలో సంరక్షణ చర్యలు తీసుకోవాలని రాయచోటి పశు వైద్యశాల ఉప సంచాలకులు డాక్టర్ మాల కొండయ్య పేర్కొన్నారు. మండలం కేంద్రంలోని పశు వైద్యశాల, రైతు సేవా కేంద్రాలతోపాటు వీరబల్లి, సోమవరం, పింగమల్ల దివ్యరాసిపల్లె, తాటికుంటపల్లె పశు వైద్యశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల్లో రికార్డులను పరిశీలించారు. అనంతరం పశువైద్యశాల సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు సకాలంలో టీకాలు, వైద్యం అందించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కండక్టర్ నిజాయితీ



ప్రయాణికుడు పోగొట్టుకున్న నగదును అందజేస్తున్న కండక్టర్ మురళీధర్

రాజంపేట : పోగొట్టుకున్న డబ్బును బాధితుడికి అందజేసి కండక్టర్ ఎస్.మురళీధర్ నిజాయితీ చాటుకున్నారు. రాజంపేటలో కడపకు వెళ్లేందుకు చిన్నపరెడ్డి అనే ప్రయాణికుడు గురువారం రాజంపేట-కడప (రాజంపేట డీపో) సర్వీసు బస్సు ఎక్కారు. అయితే కడపలో దిగేటప్పుడు బ్యాగును మరిచిపోయాడు. కండక్టర్ ఎస్.మురళీధర్ (ఈ413548) బ్యాగ్‌ను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. విషయాన్ని డిపో అధికారులకు సమాచారం ఇచ్చారు. తర్వాత డిపో మేనేజర్ గుండాల రమణయ్య సమక్షంలో బ్యాగులోని రూ.1,50,00 నగదును ప్రయాణికుడికి అందజేశారు. కండక్టరు నిజాయితీని పలువురు అభినందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, ఎంఎఫ్‌లు పాల్గొన్నారు.

నివాళి



వెంకటసుబ్బమ్మ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆకేపాటి

సిద్దవటం : మండలంలోని జ్యోతి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, సర్పంచ్ ప్రతినిధి పిన్నపురెడ్డి రవిశేఖర్‌రెడ్డి తల్లి వెంకట సుబ్బమ్మ (78) బుధవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి గురువారం జ్యోతి గ్రామానికి వెళ్లి వెంకటసుబ్బమ్మ మృతదేహానికి నివాళులు అర్పించారు. జెడ్పీటీసీ శ్రీకాంత్ రెడ్డి, పెద్దపల్లి మాజీ సర్పంచ్ కె.వి. సుబ్బయ్య, కృష్ణచైతన్య, సయ్యద్ నూర్ పాల్గొన్నారు.

పారదర్శకంగా రీసర్వే

పీలేరు రూరల్ : మండలంలో భూముల రీసర్వే పారదర్శకంగా చేపడుతున్నామని తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని వేపులబైలు పంచాయతీలో మూడో విడత భూముల రీసర్వే తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీ సుబ్రహ్మణ్యం, విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలా?.. డంపింగ్ యార్డా?

- స్కూల్ ప్రవేశ ద్వారం వద్ద పడేసిన చెత్తాచెదారం
- విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం



గాలివీడులోని జెడ్పీ పాఠశాల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

గాలివీడు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రవేశ ద్వారం వద్ద చెత్త కుప్పలను చూసి ఇది పాఠశాలనా? లేక డంపింగ్ యర్డా? అని తల్లిదండ్రులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్న ధ్యాస ఉపాధ్యాయులకు గానీ చుట్టుపక్కల వారికి గానీ లేకపోవడం విచారకరం. ఆ పాఠశాలలో చదువుతున్నది తమ పిల్లలేనన్న స్పృహ లేని చుట్టుపక్కల వారు తమ ఇళ్లల్లోని చెత్తాచెదారం, వ్యర్థాలను తెచ్చి ఎంచక్కా పాఠశాల ప్రవేశ ద్వారం ఎదుట పడవేస్తున్నారు. తరువాత ఎప్పుడో తీరిగ్గా వచ్చే చెత్త సేకరణ బండి వచ్చేవరకూ విద్యార్థులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. ఒకవేళ ఒకటి రెండు రోజుల పాటు చెత్త సేకరణ బండి రాకపోతే ఇక చెత్తకుప్పలతో పాఠశాల ప్రాంగణమంతా డంపింగ్ యార్డును తలపిస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పాఠశాల వద్ద పారిశుద్ధ్యంపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

ఒంటిమిట్ట : నులిపురుగులను నిర్మూలిద్దామని ఎంపీడీఓ కేఆర్ఎం ప్రసాద్, మండల వైద్యాధికారి హిమశ్వేత పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ వాల్ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఒకటి నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలు, కిశోర బాలలకు నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ 400 మిల్లీ గ్రాముల మాత్ర అంగన్‌వాడీ, పాఠశాలలు, కళాశాల్లో ఈ నెల 10న ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట ఎంఈఓ డి. ప్రభాకర్, ఒంటిమిట్ట వైద్యాధికారి హిమశ్వేత తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూములు పంచాలి



ధర్నా చేస్తున్న సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పుల్లంపేట : పేదలకు ప్రభుత్వ భూములను పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పందుగోల మణి కోరారు. గురువారం సీపీఐ కార్యకర్తలు పుల్లంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా మణి మాట్లాడుతూ రంగంపల్లి గ్రామ పంచాయతీ, రాచపల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 417, 578, 579 ప్రభుత్వ భూమి ఉందని ఆ భూమిని గిరిజనులకు పంచాలని కోరారు. రెవెన్యూ అధికారులు స్పందించకుంటే ఈ నెల 13వ తేదీ నుంచి పుల్లంపేట తహసీల్దార్ కార్యాలయం నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం. వెంకటరమణ, వెలుగు లక్ష్మమ్మ, వెంకటరమణ, సుబ్బనరసమ్మ , నరసమ్మ, శ్రీనివాసులు, వనజ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఓబులవారిపల్లె : రైల్వేకోడూరులోని రైల్వే సమస్యలను పరిష్కరించాలని డీఎస్ అభిరామ్‌ను డీఆర్ యూసీసీ మెంబర్ తల్లెం భరత్ కుమార్‌రెడ్డి కోరారు. గురువారం డీఎస్ అభిరామ్ రామయ్యపురం ఎల్ 87 రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను రైల్వేకోడూరు రైల్వేస్టేషన్ ముఖ ద్వారాన్ని పరిశీలించారు. అనంతరం భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని డీఆర్ఎం జీఎం దృష్టికి తీసుకెళ్లామని, త్వరితగతిన పనులు చేయించాలని కోరామన్నారు. వెంటనే పనులు చేయిస్తామని ఆయన చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బడుగుంటపల్లి సర్పంచ్ ఎం. శివయ్య, మాజీ ఏపీ టూరిజం డైరెక్టర్ మండల నాగేంద్ర, శ్రీనివాసులు, ఫారూక్, శంకరయ్య, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

పెనగలూరు : మండలంలోని కొండూరు పంచాయతీ, ఉప్పరపల్లి గ్రామానికి చెందిన రామిరెడ్డిగారి సుబ్బారెడ్డి కుటుంబాన్ని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి గురువారం పరామర్శించారు. జనవరి 25న సుబ్బారెడ్డి మృతి చెందడంతో ఆయన పెద్దకర్మ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మృతుడు సుబ్బారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ సుబ్బారెడ్డి, నందలూరు జెడ్పీటీసీ సుబ్బారెడ్డి, రాజంపేట మండల వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

రాజంపేట రూరల్ : పెద్దకారంపల్లి పంచవాయతీ ఉప సర్పంచ్ దాసరిరాజు వెంకటరాజును వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి గురువారం పరామర్శించారు. మండల పరిధిలోని హస్తివారిపల్లికి చెందిన ఉపసర్పంచ్ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వేంకటరాజు ఇటీవల అనారోగ్యంతో చికిత్స చేయించుకొచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆకేపాటి హస్తివారిపల్లి వెళ్లి వెంకటరాజును పరామర్శించారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ ఎ. వరదరాజు, నాయకులు రఘురామరాజు, ఎం.భాస్కర్‌రెడ్డి. సుబ్బరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి విద్యార్థి సత్ప్రవర్తనతో మెలగాలని కడప మహిళా పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఈదుర్‌బాష తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మహిళా శిశు సంక్షేమశాఖ బాలల పరిరక్షణ విభాగం, వన్ స్టాప్ సెంటర్‌తో కలిసి విద్యార్థులకు బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోస్టుల మంజూరుపై హర్షం

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ప్రభుత్వం నూతనంగా 176 పోస్టులు మంజూరు చేయడం హర్షణీయమని మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ మల్లిఖార్జున ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీలు, నగర పాలక సంచాయతీలు ఉద్యోగులు, సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్న విషయాన్ని పలుమార్లు ప్రభుత్వం దృష్టికెళ్లి నూతన నియామకాలు చేపట్టాని కోరామని తెలిపారు. 218 జీఓ ప్రకారం మరికొన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో పెండింగ్‌లో ఉన్న యూడీఆర్ఎల్ (సీనియర్ అసిస్టెంట్) పోస్టులను కూడా వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

రామాలయ పనుల్లో కూలీకి పాముకాటు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయం జీర్ణోద్ధరణ పనులు చేస్తున్న కూలీని గురువారం పాము కాటేసింది. రామాలయంలోని గర్భాలయంలో జీర్ణోద్దరణ పనులు చేస్తున్న మఠం నరేష్ అనే యువకుడిని పాము కాటు వేసింది. సకాలంలో వైద్యం చేయించుకోవడం వలన ప్రాణాపాయం తప్పింది.

రేపు విగ్రహ ప్రతిష్ట

రామాపురం: మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కడవకూటివాండ్లపల్లె సమీపంలో వెలసిన మరకత శివలింగం శివాలయంలో శనివారం నుంచి 10వ తేదీ వరకు ధ్వజ, పార్వతి మూలవర్ల విగ్రహ, శిఖర ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం మహా గణపతి పూజ, పుణ్యావాచకం, గంగా మాత పూజ, కలశ పూజ, యంత్ర పూజ, మహా మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. 9న ఉదయం పాతకాల పూజ, కలషా పూజ, యంత్ర పూజ, రుద్రాభిషేకం హోమాలు, శివ పారాయణం, నవగ్రహ పూజలు, అవాహిత దేవతల పూజా కార్యక్రమాలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు.

బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న శిశు సంక్షేమశాఖ అధికారి షకీలా

సుండుపల్లె: బాల్యవివాహాలు చట్టరీత్యానేరమని జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి షకీలా అన్నారు. మండల పరిధిలోని మడితాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు బాలికలను బాగా చదివించాలన్నారు. బాల్యవివాహాలు చేస్తే వారి అభివృద్ధికి ఆటంకం ఏర్పడి ఎన్నో ఆటంకాలు ఎదురవుతాయని తెలిపారు. బాల్యవివాహాలను నిర్మూలించడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. రాష్ట్రాన్ని బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశగా మార్చేందుకు అందరూ కృషిచేయాలని కోరారు. ఔట్ రిచ్ వర్కర్ సురేష్, మడితాడు సచివాలయ మహిళా పోలీసులు యశస్వనీ, నిర్మల కుమారి, ప్రధానోపాధ్యాయులు అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ముత్యపు పందిరిపై శ్రీనివాసుడు

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం స్వామి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం ముత్యపు పందరి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడిని ప్రత్యేకాలంకరణలో ఊరేగించారు.

రేషన్ షాపును తనిఖీ చేసిన జేసీ



రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న జేసీ ఆదర్శరాజేంద్రన్

రామాపురం : మండలంలోని చిట్లూరు పంచాయితీ పకీర్‌పల్లెలో రేషన్ షాపును గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సందర్భంగా రేషన్‌షాపులో బియ్యం , చక్కెర, కందిపప్పును పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు సౌకదుకాణాల వస్తువులు, రేషన్‌ను అందించాలన్నారు. కొలతల్లో తక్కువ రాకుండా సక్రమంగా పంపిణీ చేసే విధంగా చూడాలని తహసీల్దార్‌కు సూచించారు. ఆయన వెంట తహశీసీల్దార్ రామాంజనేయులు, లక్కిరెడ్డిపల్లె ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ, వీఆర్ఓ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు

వీరబల్లి : మండల కేంద్రంలో వెలసిన సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా అక్కడికి వచ్చిన ప్రజలకు, భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమం మంగళపల్లికి చెందిన వెంకటరమణ, రెడ్డమ్మ వారి ఆర్థిక సహకారంతో నిర్వహించామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం షిరిడీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌డీఎస్ సురేందర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దండోరమ్మకు పూజలు

సుండుపల్లె : మండల పరిధిలోని యర్రమనేనిపాలెం గ్రామం, గంగిరెడ్డిగారిపల్లి దగ్గర వెలసిన దండోరమ్మకు మాఘమాసంలో భక్తి శ్రద్దలతో పూలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి నైవేద్యాలు, అభిషేకాలు చేశారు. ఆలయ కార్యనిర్వహకులు అన్నదానాలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పులు

పెనగలూరు : మండలంలోని రైతులకు వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పులు చేపట్టినట్లు విద్యుత్ ఏఈ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలాన్ని ఏబీ గ్రూపులుగా విభజించామన్నారు. గ్రూప్- ఏలో సిద్దవరం, నారాయణ నెల్లూరు, చక్రంపేట, కట్టావారిపల్లి, ఎన్ఆర్ పురం, తిరునంపల్లి గ్రామాలకు ఉదయం 8.15 గంటల నుంచి మధ్యాహ్నం 3.15 గంటల వరకు వ్యవసాయానికి మూడు పేసులు ద్వారా విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు. అలాగే గ్రూప్-బీలో ఈటమాపురం, నల్లపరెడ్డి పల్లి, ముద్రపల్లి, గోవిందంపల్లి, తిమ్మయ్యగారిపల్లి, కొండూరు, దామనచర్ల గ్రామాలకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. ఈ విద్యుత్ వేళల్లో మార్పులను రైతులు గమనించి సహకరించాలని కోరారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత



సామగ్రిని అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం పాఠశాలకు పూర్వ విద్యార్థులు చేయూతనందించారు. 2004-05 విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ. 32 వేలు విలువగల ఐదు బల్లలు, ఒక బీరువా, 15 కుర్చీలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అంజి, పూర్వ విద్యార్థులు సురేష్, అనీల్ కుమార్ రెడ్డి, రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

9న మెగా వైద్య శిబిరం



మాట్లాడుతున్న అల్ హాది వెల్ఫేర్ అండ్ హ్యూమన్ రైట్స్ సభ్యులు

నందలూరు : అల్ హాది వెల్ఫేర్ అండ్ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కువైట్ ప్రవాస నందలూరు యూత్ సహకారంతో ఆదివారం నందలూరు బస్టాండ్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద మెగా వైద్య, రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ మహమ్మద్ ఇబ్రహీమ్, అన్నమయ్య జిల్లా ప్రెసిడెంట్ సయ్యద్ నజీర్, జిల్లా సలహాదారుడు షేక్ కరిముల్లా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య శిబిరంలో చిన్న పిల్లలు, వృద్ధులకు కంటి సమస్యలకు, కీళ్ల సమస్యలకు, కిడ్నీ సంబంధిత సమస్యలకు, మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక పరీక్షలతోపాటు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ శిబిరంలో కడపకు చెందిన ప్రముఖ వైద్యుల పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు.

ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ



విద్యార్థులతో అధ్యాపకులు

రాయచోటి అర్బన్ : ప్రాంగణ ఎంపికల్లో తమ విద్యార్థులు ప్రతిభను చాటినట్లు సాయి ఇంజినీరింగ్ కళాశాల ఏడీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం గురువారం బెంగళూరుకు చెందిన డీకోడింగ్ ల్యాబ్స్ సంస్థ ప్రతినిధులు క్యాంపస్ సెలెక్షన్స్‌ను నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ రవిశాస్త్రి, హెచ్ఆర్ మేనేజర్ వినోద్ కుమార్ విద్యార్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. ప్రతిభను కనపరచిన సాత్విక, మనీషా, వెన్నెల, సాయిప్రసన్న, వై. అమరనాథ్‌రెడ్డిలను సాఫ్ట్‌వేర్ ట్రైనీ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరికి రూ.4లక్షల వార్షికవేతనం అందిస్తామని డీకోడింగ్ ల్యాబ్స్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలాజీ, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కొత్తపల్లె ఇంతియాజ్, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.